31న మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల, జూలై 28: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల(శ్రీకాకుళం)లో వివిధ బ్రాంచ్‌ల్లో కౌన్సెలింగ్‌లో భర్తీకాగా మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 31న కళాశాల ఆవరణలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదర రావు తెలిపారు. 'మెకానికల్‌లో 4, సివిల్‌లో 7, ఈఈఈలో 6, డీసీసీపీలో 27 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఏ కళాశాలలో చేరని విద్యార్థులు మాత్రమే స్పాట్ అడ్మిషన్లకు అర్హులు. కౌన్సెలింగ్ ఫీజు రూ.1300. వార్షిక ఫీజు రూ.4,700 చొప్పున చెల్లించి అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది. సోమవారం నుంచి కళాశాలలో దరఖాస్తులు అందజేస్తాం. ఆసక్తి గల విద్యార్థులు సంప్రదించాలని దామోదరరావు సూచించారు.




- జిల్లాలో జోరుగా పొలం పనులు
- ఊపందుకున్న ఉబాలు

నరసన్నపేట: జమ్ము వద్ద ఉబాలు వేస్తున్న మహిళా రైతులు

ఇచ్ఛాపురం : ట్రాక్టర్‌తో దమ్ము.

ఎచ్చెర్ల: కలుపు నివారణ కోసం.. పురుగుల మందు పిచికారీ

ఖరీఫ్.. సందడి

(నరసన్నపేట/ ఎచ్చెర్ల/ పలాస రూరల్/ ఇచ్ఛాపురం)

జిల్లాలో ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇటీవల పది రోజులుగా భారీ వర్షాలు కురిశాయి. వంశధార, నాగావళి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. కాలువల ద్వారా నీరు విడిచిపెట్టడంతో రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాలకు గట్లు వేస్తూ.. నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 5 లక్షల ఎకరాల్లో సాగు చేయనున్నట్టు వ్యవసాయాధికారుల అంచనా. ఎక్కువ భాగం వరి సాగు చేయనున్నారు.



పలాస రూరల్ : దొనగొరలో ఉబాల పనులు..

ఈ మేరకు ఇప్పటికే కొన్నిచోట్ల పొలంలో దమ్ము చేపట్టి.. ఉబాలు వేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఉదాహరణకు పలాస మండలంలోని తర్లాకోట, కైజోల, కొత్తూరు, సున్నాడ, అల్లుకోల, రెంటికోట, లొద్దబద్ర, నవరగోవిందపురం, దొనగొర, సిరిపురం ప్రాంతాల్లో ఉబాలు పనులు ఊపందుకున్నాయి. ఇక మెట్టు ప్రాంతాలైన రణస్థలం, లావేరు, ఎచ్చెర్ల తదితర మండలాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. వర్షాలు పడటంతో మొక్కజొన్న పంటలో కలుపు ఏరివేత పనులు చేపడుతున్నారు. అలాగే కూరగాయలు, వేరుశనగ పంట పొలాల్లో కూడా కలుపు తీస్తున్నారు.

కూలీలు దొరక్క అవస్థలు..

ఒక్కసారిగా పొలం పనులు ప్రారంభం కావడంతో కూలీలు దొరకక రైతులు అవస్థలు పడుతున్నారు. గట్లు వేసేందుకు రోజుకు ఒక్కొక్కరికీ రూ.600 చొప్పున ఇస్తున్నా.. కూలీల దొరకని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇక దమ్ముకు కూలీలు వెళ్లేందుకు ఇష్టపడటం లేదు. యాంత్రీకరణ నేపథ్యంలో నొల్ల తోలేందుకు తగిన పరిజ్ఞానంగల కూలీలకు డిమాండ్ పెరిగింది. ఆకుతీత, ఊబాలు వేసేందుకు కాంట్రాక్ట్ పద్ధతిలో కూలీలు డబ్బులు వసూలు చేస్తున్నారు. గతంలో ఎకరా పొలంలో ఉబాలు వేసేందుకు రూ.4వేలు ఖర్చయ్యేది. ప్రస్తుతం కూలీల కొరత కారణంగా రూ.7వేల వరకూ వెచ్చించాల్సి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలెన్నో..

ప్రస్తుత వర్షాకాలంలో రైతులకు పలు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ప్రకృతిపరంగా జరిగే ప్రమాదాలతో పాటు ఎరువులు, క్రిమి సంహారక మందులు చల్లేటప్పుడు అప్రమత్తంగా వ్యహరించాల్సి ఉందని వ్యవసాయశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. వర్షం కురిసేటప్పుడు ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశం ఉందని, ఆ సమయంలో పొలంలోనూ, చెట్ల కింద ఉండరాదని సూచిస్తున్నారు. పొలాల్లో ఉన్న మోటార్లకు, సార్టర్లకు రక్షణ చర్యలు చేపట్టాలని, లేదంటే విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. చేతులకు గ్లౌజులు వేసుకుంటే విద్యుదాఘాతం నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు. అలాగే పొలాల్లో పాముల సంచారం కూడా ఎక్కువగా ఉంటుందని, కలుపు మొక్కలు తీసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు. ఏదైనా కాటు వేసినట్టు అనిపిస్తే వెంటనే 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి వైద్యం చేయించుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

జాగ్రత్తలు అవసరం..

ఖరీఫ్ పనులు ప్రారంభమయ్యాయి. ఎరువులు, క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు అవసరం. లేదంటే పొలాల్లోనే అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. పురుగుల మందు పిచికారీ చేసేటప్పుడు చేతులకు గ్లౌజు, కాళ్లకు రబ్బరు బూట్లు, ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి. పిచికారీ చేసిన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి. పురుగుల మందుల డబ్బాలను పొలాల్లోనే, ఇంటి వద్దనే వుంచకుండా గోతులు తవ్వి వాటిలో కప్పివేయాలి.

-వై.సురేష్, వ్యవసాయాధికారి, ఎచ్చెర్ల



నిలదీస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ఐదేళ్లలో చేసిందేమిటి?

- అభివృద్ధి లేదు.. ఒక్క రూపాయి విదల్చలేదు..
- జడ్పీస్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్యే రవికుమార్ మండిపాటు
- అత్యధిక మంది వైసీపీ జడ్పీటీసీలు గైర్హాజరు..



సమీక్షలో జడ్పీ చైర్‌పర్సన్ విజయ, జడ్పీ సీఈవో

శ్రీకాకుళం, జూలై 28(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో జిల్లాలో అభివృద్ధి జరగలేదని.. ఒక్క రూపాయి కూడా ఇతరత్రా కార్యక్రమాలకు విదల్చలేదని మాజీ విప్, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. ఆదివారం జడ్పీ కార్యాలయంలో జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ.. 'వెనుకబడిన జిల్లాగా సిక్కోలుకు ముద్ర ఉంది. గత వైసీపీ పాలనలో మరో ఇరవై ఏళ్లు వెనక్కి వెళ్లిపోయింది. వెనుకబడిన జిల్లాకు.. శాఖల వారీగా నిధులు ఇవ్వకుండా.. గత ఐదేళ్లలో మంత్రులు.. ఇతరత్రావారికి వైసీపీలో మంచిమంచి పదవులు కట్టబెట్టారు. వాటివల్ల జిల్లాకు ఏం ప్రయోజనం కలిగింద'ని ప్రశ్నించారు. శాఖల వారీగా ప్రస్తావిస్తూ.. గత ప్రభుత్వం ఏవిధమైన నిధులు కేటాయించలేదని స్పష్టం చేశారు. ఆయనతోపాటు ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కూడా పాల్గొని.. అధికారుల తీరుపై ప్రశ్నలు సంధించారు. దీనిపై అధికారుల నుంచి సరైన సమాధానం కరువైంది.

- జడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తుండటంతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని.. సురక్షితమైన తాగునీరు అందించాలని.. అధికారులకు సూచించారు. కాగా.. ఈ కార్యక్రమానికి వైసీపీకి చెందిన జడ్పీటీసీలు అత్యధికమంది గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, జడ్పీ సీఈవో వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ చిట్టిరాజు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, సీపీఓ ప్రసన్న, ఇతర అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా భూములు లాక్కున్నారు

- మాజీ మంత్రి సీదిరి ఆధ్వర్యంలో కబ్జా
- నల్లబొడ్లూరు కొండపై రైతుల ఆందోళన
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

హరిపురం, జూలై 28: నాలుగేళ్లుగా వివాదాస్పదంగా మారిన నల్లబొడ్లూరు కొండ వివాదం మరో మలుపు తిరిగింది. కొండపై తమకు చెందిన భూములను కొంతమంది వైసీపీ నాయకులు మాజీమంత్రి సీదిరి అప్పలరాజు పేరు చెప్పి.. బలవంతంగా లాక్కున్నారని ఆరోపిస్తూ ఆదివారం కొండపై రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ '25 ఏళ్ల కిందట ఈ కొండపై సుమారు పది కుటుంబాలకు 10ఎకరాల స్థలం పట్టాలు అందజేశారు. ఈ స్థలంలో జీడి, మామిడి తోటలు వేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాలుగేళ్ల కిందట వైసీపీ నాయకులు, స్థానిక సర్పంచ్, ఎంపీపీ దానయ్య.. అప్పటి మంత్రి సీదిరి అప్పలరాజు పేరుచెప్పి మా భూములు బలవంతంగా లాక్కున్నారు. ఎదురుతిరిగితే భయపెట్టి బెదిరించారు. గట్టిగా నిలదీస్తే ఇళ్లపట్టాలతోపాటు నష్ట పరిహారం కూడా అందిస్తామని నమ్మబలికారు. తీరాచూస్తే తోటలు తొలగించి కంకర, రాళ్లు అమ్ముకున్నారని, ఈ ప్రాంతం చదును చేసి కబ్జాకు పాల్పడ్డారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం అందజేసిన పట్టాలు చేతపట్టుకుని ఆందోళనకు దిగారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. తమ భూములు తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. కొండను తవ్వి అక్రమాలకు పాల్పడి రూ.కోట్లు సంపాదించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మావోయిస్టు నేత ఆజాద్ తల్లి కాములమ్మ, తులసమ్మ, వాసుదేవ, నీలకంఠం పాల్గొన్నారు.



నల్లబొడ్లూరు కొండపై ఆందోళన చేస్తున్న రైతులు



తవ్వేస్తున్నారు

తాళభద్ర చెరువు వద్ద ట్రాక్టర్లలోకి మట్టి లోడింగ్

- తాళభద్ర చెరువులో మట్టి అక్రమ తరలింపు
- పట్టించుకోని అధికారులు

పలాస, జూలై 28: పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి ఐదో వార్డు తాళభద్రలోని శ్మశానం పక్కన ఉన్న చెరువులో మట్టి, కంకర అక్రమ తవ్వకాలు జోరందుకున్నాయి. నెల రోజుల నుంచి ఇక్కడ మట్టిని అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఇటుక బట్టీలు, భవన నిర్మాణాలకు సంబంధించిన పునాదుల్లో వేసేందుకు తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టిలోడుకు రూ.700 వరకూ వసూళ్లు చేస్తూ.. ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న చెరువులో మట్టి తవ్వకాలు జరుగుతున్నా సంబంధిత సిబ్బంది చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత వైసీపీ పాలనలో చెరువులు, కాలువలు, కొండలు ఏవీ విడిచిపెట్టకుండా.. అనుమతులు లేకుండానే అక్రమ తవ్వకాలు చేపట్టారు. ప్రస్తుతం ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వీటి తవ్వకాలు ఆగిపోతాయని అంతా భావించారు. కానీ, అందుకు విరుద్ధంగా అధికారుల సెలవు దినాలు, పదోన్నతిలో బిజీగా ఉన్న సమయాలను అక్రమార్కులు తెలుసుకొని యథేశ్చగా మట్టిని తరలిస్తూ జేబులు నింపుకొంటున్నారు. కొద్ది రోజుల కిందట స్థానిక పెంటిభద్ర రోడ్డులో ఉన్న కుంకుమసాగరం చెరువులో కూడా ఇలాగే తవ్వకాలు చేపట్టారు. 'ఆంధ్రజ్యోతి'లో కథనం రాగా.. అధికారులు వాటిపై విచారణ జరపడంతో తవ్వకాలు కొంతమేరకు ఆగాయి. ప్రస్తుతం తాళభద్ర చెరువులో తవ్వకాలు చేపడుతున్నా.. అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మునిసిపల్, రెవెన్యూ, మైన్స్ అధికారుల అనుమతులు లేకపోయినా.. అక్రమార్కులు యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ వ్యవహారంపై వీఆర్వో కె.ఖగేశ్వరరావు వద్ద ప్రస్తావించగా.. ఇప్పటికే చెరువు తవ్వకాలపై ప్రభుత్వానికి తెలిపామన్నారు. రైల్వే పరిధిలో కొంత భాగం తవ్వడంతో రైల్వే పోలీసులు సైతం కేసు నమోదు చేశారని తెలిపారు.

ఆదివారమైతే.. చాలు..

- ఇష్టారాజ్యంగా కంకర రవాణా



కొండపై కంకర తవ్వకాలు


మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రానికి సమీపంలోని.. ప్రభుత్వానికి సంబంధించిన కొండపై అధికంగా కంకర తరలిస్తున్నా పట్టించుకునే నాథులు లేరు. ఆదివారం అయితే చాలు.. అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఆదివారం ప్రభుత్వ కార్యాలయాలు సెలవు కావడంతో అధికారులు ఎవరూ అందుబాటులో ఉండరనే ఉద్దేశంతో యథేచ్ఛగా కంకర తవ్వకాలు చేపడుతున్నారు. వేకువజాము నుంచీ యంత్రాలతో తవ్వకాలు చేపట్టి.. ట్రాక్టర్ల ద్వారా వసుంధర, కొసమాల లో కొత్తగా వేస్తున్న లేఅవుట్‌లకు కంకరను తరలిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ అక్రమ తవ్వకాలు చేపడుతున్నా.. పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొంతమంది టీడీపీ నేతల పేర్లు చెప్పి.. అక్రమ దందా సాగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే అధికారులు కూడా చూసీచూడనట్టు వదిలేస్తున్నారని తెలుస్తోంది. ఎన్నికల నేపథ్యంలో వచ్చిన తహసీల్దార్ జానకమ్మ శుక్రవారం రిలీవ్ అయ్యారు. కొత్త తహసీల్దార్ ఇంకా రాలేదు. ఈ నేపథ్యంలో దిగువస్థాయి రెవెన్యూ అధికారులు కంకర మాఫియాతో లాలూచీ పడి.. అక్రమాలకు సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి.. అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

జీజీహెచ్‌లో కుక్కల బెడద

- భయాందోళన చెందుతున్న రోగులు

(అరసవల్లి)

శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్-రిమ్స్)లో రోగులకు కుక్కల బెడద వెంటాడుతోంది. జిల్లా నలుమూలల నుంచి వైద్యం కోసం నిత్యం వందలాది మంది రోగులు, వారి సహాయకులు రిమ్స్‌కు వస్తుంటారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లల విభాగాలు కూడా కిటకిటలాడుతుంటాయి. నిత్యం సెక్యూరిటీ గార్డులు పర్యవేక్షిస్తూ ఉంటారు. అయినా సరే ఆస్పత్రి లోపలకి కుక్కలు ఎలా ప్రవేశిస్తున్నాయో ఎవరికీ తెలీదు. ఆస్పత్రి వార్డులు, వరండాలు, పరిసరాల్లో కుక్కలు తిరుగుతుండడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. మెటర్నిటీ వార్డు, పసికందుల ప్రత్యేక వార్డు రూముల్లోకి పొరపాటున కుక్కలు ప్రవేశిస్తే.. పరిస్థితి ఏంటని బిక్కుబిక్కుమంటున్నారు. ఈ నెల 18న సాక్షాత్తూ మంత్రి అచ్చెన్నాయుడు.. ఆస్పత్రిలో అన్ని విభాగాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలని, అందుకు కావలసిన సహాయ సహకారాలను అందిస్తామన్నారు. అంకితభావంతో పనిచేయాలని, నిర్లక్ష్యంగా వహించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అయినా సరే పరిస్థితిలో ఏమాత్రం మార్పు లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి పరిస్థితులను చక్కదిద్దాలని కోరుతున్నారు.

రిమ్స్‌లో ఎక్కడ చూసినా కుక్కల సంచారమే..


దిక్సూచి
శ్రీకాకుళం ● సోమవారం 29 జూలై 2024
diksuchi@andhrajyothy.com

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ 1872 స్థానంలో భారతీయ సాక్ష్య అధినియమ్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్‌లో 167 సెక్షన్లు ఉండగా, ప్రస్తుతం బీఎస్ఏలో 170 సెక్షన్లు ఉన్నాయి. గత చట్టంలోని 23 సెక్షన్లలో మార్పులు చేశారు.

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 3

భారతీయ సాక్ష్య అధినియమ్



కీలకాంశాలు

- ఈ చట్టం 'డాక్యుమెంట్' నిర్వచనాన్ని విస్తరించింది. ఎలక్ట్రానిక్స్/ డిజిటల్ రికార్డులను కూడా ఈ చట్టం పేపర్ డాక్యుమెంట్స్‌తో సరిసమాన సాక్ష్యాలుగా పరిగణిస్తోంది. ఈ-మెయిల్స్, సర్వర్ లాగ్స్, కంప్యూటర్స్, స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, ఎస్సెమ్మెస్‌లు, వెబ్‌సైట్‌లు, లోకేషనల్ ఎవిడెన్స్ వంటి డిజిటల్/ ఎలక్ట్రానిక్స్ సాక్ష్యాలను దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చు.
- అంతేకాక ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా సాక్ష్యులు, బాధితులు, ముద్దాయిలు తమ వాంగ్మూలం ఇవ్వడానికి ఈ కొత్త చట్టం అనుమతిస్తూ, దానికి వ్యక్తిగత ప్రత్యక్ష వాంగ్మూలంతో సరిసమాన స్థాయి కల్పించింది.
- ముద్దాయి నేరం అంగీకారాన్ని, ఇకపై క్రిమినల్ కేసుల్లో తప్పనిసరిగా పరిగణించక్కర్లేదు. బెదిరింపులు, ప్రలోభాలు తదితరాల కారణంగా నేరాంగీకారం జరిగినట్లు న్యాయమూర్తి భావిస్తే దానిని పరిగణనలోకి తీసుకోనవసరం లేదు.
- సోదాలు, నేర సంఘటన స్థల పరిశీలన సమయంలో తప్పనిసరిగా సంబంధిత అధికారి ఫోన్ ద్వారా చిత్రీకరణ జరపాల్సి ఉంటుంది. అలాంటి దృశ్య, శ్రవణ చిత్రీకరణలు జతచేయని చార్జిషీట్లు చెల్లవు. ఈవిధంగా చిత్రీకరించిన దృశ్య శ్రవణ చిత్రీకరణలు నేరుగా క్లౌడ్ బేస్డ్ ప్లాట్‌ఫాంలోకి అప్‌లోడ్ చేయవచ్చు. టాంపరింగ్, అవకతవకలు నివారించడానికి ఎటువంటి జాప్యం లేకుండా వీటిని కోర్టుకు సమర్పించాల్సి ఉంది.
- కోర్టుల్లో పరీక్షించలేని భారీ పరిణామం గల డాక్యుమెంట్స్ లేదా సాంకేతికపరమైన డాక్యుమెంట్ల పరిశీలనలో నిష్ణాతులైన వారు ఇచ్చే వాంగ్మూలాన్ని సెకండరీ ఎవిడెన్స్(ద్వితీయస్థాయి సాక్ష్యం)గా పరిగణిస్తారు.
- ఒక నేరంలో భాగమైన వ్యక్తులను సామూహికంగా విచారిస్తున్నప్పుడు (జాయింట్ ట్రయిల్) వారిలో ఎవరైనా అరెస్ట్ వారెంట్ అందుకోకపోయినా, పరారీలో ఉన్నా సరే వారిని కూడా కలిపే న్యాయవిచారణ చేస్తారు.

విమర్శలు

- సాక్ష్యాధారాలు చిత్రీకరించే సమయంలో, తదుపరి కూడా నేటి ఆధునిక సాంకేతికతల సహాయంతో, సాంకేతికపరమైన లోపాల సహకారంతో ఏమార్చే అవకాశం ఉంది.
- ఎలక్ట్రానిక్ రికార్డులు ధృవీకరణ పొంది ధృవపత్రాలను కలిగి ఉన్నప్పుడే వాటిని డాక్యుమెంట్స్‌గా పరిగణిస్తారు. కానీ బీఎస్ఏలో సాధారణ డిజిటల్, ఎలక్ట్రానిక్ సమాచారాన్ని కూడా సాక్ష్యంగా డాక్యుమెంట్ల స్థాయి కల్పించి పరిగణించడం వైరుధ్యాలకు కారణం అవవచ్చు.
- పోలీసు కస్టడీలోని వ్యక్తి శరీరంపై ఉన్న గాయాలకు పోలీసులు బాధ్యత వహించాలి అనే అత్యున్నత న్యాయస్థానం, లా కమిషన్ సిఫార్సులకు మన్నన దక్కలేదు. అట్టి కట్టుబాటు పోలీసులపై ఏర్పడలేదు.
- కేవలం ఏవో కొన్ని అంశాలు మినహా పాత చట్టమే కొత్తరూపుతో కొనసాగింపునకు వచ్చింది. సాంకేతిక అంశాల జోడింపు తప్ప ఇతరత్రా పెద్దగా విప్లవాత్మక మార్పులు ఏమీ లేవు.
- కొన్ని క్రిమినల్ కేసుల్లో ఫోరెన్సిక్ దర్యాప్తు తప్పనిసరి చేశారు. కానీ నేర స్థలానికి మొదట వెళ్లేది పోలీసులు. వారి సోదాలు, పరిశీలనల చిత్రీకరణల వల్ల ఫోరెన్సిక్ ఆధారాలు భంగపడవచ్చు.

అయితే సాంకేతిక అంశాల జోడింపుతో ఈ కొత్తచట్టం విచారణలో వేగాన్ని తీసుకురావడానికి తోడ్పడటంతోపాటు మారుతున్న నేరాల సరళి నేపథ్యంలో సాక్ష్యాల పరిధిని విస్తరించిందనడం అతిశయోక్తి కాదు. అదేవిధంగా నేరవిచారణలో, దర్యాప్తులో అక్రమాలను నిరోధించేందుకు సాంకేతికపరంగా చేసిన మార్పులు పారదర్శకతను పెంపొందించగలవు. అయితే గత చట్టంలోని అన్ని అంశాలను పూర్తిగా సంస్కరించలేదు. కేవలం కొద్దిపాటి అంశాల్లోనే మార్పులు చేసి కొత్త చట్టాన్ని రూపొందించారు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలకు నోచుకోని పరిస్థితుల్లో దీనిని ఒక ముందుడుగు గానే పరిగణించాలి.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

ఏపీపీఎస్సీ /ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఘనము

రీజనింగ్

I) 8 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల ఎరుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 2 సెం॥ మీ॥ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వల్ల మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 20 బి) 40 సి) 56 డి) 64
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 8 బి) 6 సి) 12 డి) 16
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 24 సి) 32 డి) 48
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 12 బి) 18 సి) 10 డి) 24
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 18 బి) 12 సి) 8 డి) 6

సమాధానాలు:
1. (డి) 2. (ఎ) 3. (బి) 4. (డి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{8}{2} = 4$

మొత్తం ఘనాలు = $(n^3) = 4^3 = 64$.

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికీ మారదు).
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n - 2) \times 12 = (4 - 2) \times 12 = 2 \times 12 = 24$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (4-2)^2 \times 6$
$= (2)^2 \times 6 = 4 \times 6 = 24$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు
$(n-2)^3 = (4-2)^3 = 2^3 = 8$

సులభపద్ధతి: 8 సెం.మీ. కొలత ఉన్న ఘనం 2 సెం॥ మీ॥ కొలతతో విభజిస్తే అంటే నాలుగు నాలుగుగా ఏర్పడుతుంది. ఇప్పుడు నాలుగు నాలుగుగా ఉండే రేఖాచిత్రం ఔట్‌సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	3
2	1	1	2
2	1	1	2
3	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $4^3 = 64$
2. మూడు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే కార్నర్ 4ని 2తో గుణించాలి. (2 అంటే పై వైపు 4 కార్నర్స్ కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) 4 x 2 = 8
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న, ఘనాలు అంటే కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అంటే పై వైపు, కింద వైపు, మధ్య వైపు) పై రేఖాచిత్రం గమనించిన కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలినవి 8. దీనిని 3తో గుణించగా 8 x 3 = 24.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలోని భాగంలో గల వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అంటే ఆరు ముఖాలు అని అర్థం) పై రేఖాచిత్రం గమనించిన చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 4 ఉన్నాయి. కావున 4 x 6 = 24.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
64-(24+24+8) = 64 - 56 = 8 సమాధానం అవుతుంది.

II) 15 సెం॥ మీ॥ల కొలత ఉన్న చతురస్రాకార చెక్క ఘనానికి అన్ని వైపుల పసుపు రంగును వేశారు. ఇప్పుడు ఈ ఘనాన్ని ప్రతి అంచు 3 సెం.మీ.ల కొలత ఉండే చిన్న చిన్న ఘనాలుగా విభజించారు. ఈ సమాచారం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు తెలపండి.

1. ఆ విభజన వలన మొత్తం ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 100 బి) 150 సి) 125 డి) 175
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 16 బి) 8 సి) 24 డి) 12
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 36 బి) 12 సి) 48 డి) 24
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు ఎన్ని?
ఎ) 48 బి) 54 సి) 63 డి) 52
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఎన్ని ఘనాలు ఏర్పడతాయి?
ఎ) 12 బి) 18 సి) 27 డి) 36

సమాధానాలు: 1. (సి) 2. (బి) 3. (ఎ) 4. (బి) 5. (సి)

వివరణ:

1. $n = \frac{\text{పెద్ద ఘనము యొక్క అంచు పొడవు}}{\text{చిన్న ఘనము యొక్క అంచు పొడవు}} = \frac{15}{3} = 5.$

మొత్తం ఘనాలు $n^3 = 5^3 = 125$

2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అంటే 8 (ఫిక్స్ ఎప్పటికీ మారదు)
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2) \times 12 = (5-2) \times 12 = 3 \times 12 = 36$
4. ఒక ముఖానికి మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు
$(n-2)^2 \times 6 = (5-2)^2 \times 6$
$= 3^2 \times 6 = 9 \times 6 = 54$
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు = $(n-2)^3$
$= (5-2)^3$
$= 3^3 = 27.$

సులభ పద్ధతి: 15 సెం.మీ. కొలత ఉన్న ఘనం 3 సెం.మీ.ల కొలతతో విభజించడం అంటే 15÷3=5 అయిదు అయిదుగా ఏర్పడుతుంది. ఇప్పుడు అయిదు అయిదుగా ఉండే రేఖాచిత్రం వన్ సైడ్ మాత్రమే వేసుకోవాలి.

3	2	2	2	3
2	1	1	1	2
2	1	1	1	2
2	1	1	1	2
3	2	2	2	3

1. మొత్తం ఘనాలు అంటే $5^3 = 125$.
2. మూడు ముఖాలకు రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ 4ని 2తో గుణించాలి. (2 అనగా పై వైపు 4 కార్నర్స్, కింది వైపు 4 కార్నర్స్ అని అర్థం) 4 x 2 = 8.
3. రెండు ముఖాలకు మాత్రమే రంగును కలిగి ఉన్న ఘనాలు అనగా కార్నర్స్ కాకుండా చుట్టూ ఉన్న వాటిని లెక్కించి 3తో గుణించాలి. (3 అనగా పై వైపు, కింది వైపు, మధ్యవైపు) పై రేఖాచిత్రం గమనిస్తే కార్నర్స్‌ని తీసివేయగా చుట్టూ భాగంలో మిగిలింది 12. దీనిని 3తో గుణిస్తే 12 x 3 = 36.
4. ఒక ముఖానికి మాత్రమే రంగును ఉన్న ఘనాలు అనగా చుట్టూ భాగాన్ని తొలగించి మధ్యలో ఉండే వాటిని లెక్కించి 6తో గుణించాలి. (6 అనగా ఆరు ముఖాలు అని అర్థం)పై రేఖాచిత్రం గమనిస్తే చుట్టూ భాగాన్ని తీసివేయగా మధ్యలో 9 ఉన్నాయి. కాబట్టి 9 x 6 = 54.
5. ఏ ముఖం ఏ రంగు లేకుండా ఉండే ఘనాలు అంటే మొత్తం - (ఒక ముఖానికి, రెండు ముఖాలకు, మూడు ముఖాలకు రంగును కలిగి ఉండే ఘనాలు)
125 - (54+36+8)
125 - 98 = 27 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

నవ్య | చిత్రజ్యోతి

పారిస్ వీధుల్లో పలకరింపు




ప్రస్తుతం మెగా ఫ్యామిలీతో కలసి రామ్‌చరణ్ పారిస్‌లో ఒలింపిక్స్ క్రీడా సంబరాలను ఆస్వాదిసున్నారు. భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మహిళల సింగిల్స్‌లో తొలి విజయాన్ని నమోదు చేశారు. వీరిద్దరూ పారిస్ వీధుల్లో అనుకోకుండా ఒకరికొకరు ఎదురు పడ్డారు. చిరునవ్వుతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. రామ్‌చరణ్ పెంపుడు కుక్క పిల్ల 'రైమ్' తలనిమిరారు సింధు. వారిద్దరూ సరదాగా మాట్లాడుకుంటున్న వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇద్దరూ గేమ్ ఛేంజర్‌లే మీ కలయిక అద్భుతం అంటూ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' చిత్రంలో నటిస్తున్నారు.

సరికొత్త కాన్సెప్ట్‌తో...



వైవిధ్యమైన చిత్రాలతో దూసుకుపోతున్న కథానాయకుడు అల్లరి నరేశ్. ఆయన హీరోగా 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఓ నూతన చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. రుహాని శర్మ హీరోయిన్. సూర్య దేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమాను ఆరంభించారు. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని మేకర్స్ తెలిపారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: రామకృష్ణ అర్రం, కెమెరా: జిజు సన్నీ, సంగీతం: జిబ్రాన్.

కొత్త తరహా పాత్ర



తమిళ హీరో ధనుష్, నాగార్జున కాంబినేషన్‌లో దర్శకుడు శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న 'కుబేర' చిత్రం షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. ధనుష్ పుట్టిన రోజు సందర్భంగా ఆదివారం స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఇదివరకు ఎన్నడూ చేయని పాత్రను ధనుష్ ఇందులో పోషిస్తున్నారు. ఆయన పెర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుందని మేకర్స్ చెప్పారు. హై బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సోషల్ డ్రామాలో రష్మిక కథానాయిక. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహనరావు తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఫిల్మ్ ఛాంబర్ కొత్త అధ్యక్షుడిగా భరత్ భూషణ్




తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రస్తుత అధ్యక్షుడు దిల్ రాజు పదవీకాలం ముగియడంతో ఆదివారం ఎన్నికలు జరిపి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు.. ఈసారి డిస్ట్రిబ్యూటర్ సెక్టార్ నుంచి పి.భరత్ భూషణ్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా కె.అశోక్‌కుమార్ గెలిచారు. ఈ సందర్భంగా నిర్మాత సి.కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ 'పరిశ్రమలో చాలా సమస్యలు ఉన్నాయి. అందరం కలసి మంచి నిర్ణయాలతో ముందుకు వెళతాం. ఈ రోజు గెలిచిన అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాటకు కట్టుబడి ఉండే వ్యక్తులు. గెలిచిన వారికి సభ్యులందరి మద్దతు ఉంటుంది' అన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'ఛాంబర్ అంతా ఒక కుటుంబం. పరిశ్రమలోని సమస్యలను ఎలా ఎదుర్కోవాలో అందరం కలసి చర్చిస్తాం. భారతదేశంలోని అన్ని పరిశ్రమలను ఒక తాటి మీదకు తీసుకు వచ్చి ముందుకు వెళతాం' అన్నారు. తన విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ భరత్ భూషణ్ కృతజ్ఞతలు తెలిపారు.

'మిరపకాయ్' కంటే మెరుగ్గా



రవితేజ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో తయారవుతున్న 'మిస్టర్ బచ్చన్' రిలీజ్ డేట్ దగ్గర పడుతుండడంతో నిర్మాతలు ప్రమోషన్స్‌లో దూకుడు పెంచారు. ఇందులో భాగంగా ఆదివారం టీజర్ విడుదల చేశారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో తెర కెక్కిన ఈ చిత్రంలో ఓ పవర్‌ఫుల్ వ్యక్తిపై రైడ్ చేసే ఇన్‌కమ్ టాక్స్ అధికారిగా రవితేజ నటిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. జగపతిబాబు కీలక పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ '1980-90ల మధ్య జరిగే కథ ఇది. ల్యాండ్ ఫోన్లు, క్యాసెట్ రికార్డింగ్ సెంటర్లు, చేతక్ స్కూటర్లు, కుమార్ షాను పాటలు.. ఇవన్నీ 'మిస్టర్ బచ్చన్' ఫస్ట్ హాఫ్‌లో నోస్టాల్జిక్ మూమెంట్స్‌గా ఉంటాయి. అలాగే అమితాబ్ గారిని బేస్ చేసుకుని కొన్ని ఐటెమ్స్ ఉంటాయి. నా కెరీర్‌లో చాలా ఫాస్ట్‌గా.. కేవలం 78 రోజుల్లో ఈ సినిమా తీశానంటే కారణం నిర్మాత విశ్వప్రసాద్‌గారు. ఇంతకుముందు మా కాంబినేషన్‌లో వచ్చిన 'మిరపకాయ్' కంటే మెరుగ్గా ఈ సినిమా ఉంటుంది' అన్నారు. 'ఆగస్టు 15న సినిమాను విడుదల చేస్తున్నాం' అని విశ్వప్రసాద్ తెలిపారు.

సుకుమార్ సతీమణి సమర్పణలో..



రావు రమేశ్ హీరోగా నటించిన 'మారుతీ నగర్ సుబ్రహ్మణ్యం' ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధమైంది. దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సమర్పణలో వస్తున్న తొలి చిత్రం ఇది కావడం విశేషం. కంటెంట్ నచ్చడంతో మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ సంస్థ ఆగస్టు 23న విడుదల చేస్తోంది. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రామ్‌చరణ్ ఆదివారం విడుదల చేశారు. 'మారుతీనగర్ సుబ్రహ్మణ్యం' చిత్రంలో ఎటకారం ఎక్కువున్న సుబ్రహ్మణ్యం భార్యగా ఇంద్రజ, అత్తగారిగా అన్నపూర్ణమ్మ నటించారు. 'మా నాన్న అల్లు అరవింద్' అంటూ గొప్పలు చెప్పి ఓ డబ్బున్న అమ్మాయిని ప్రేమలో పడేసే సుబ్రహ్మణ్యం కొడుకుగా అంకిత్ కొయ్య. అతని సరసన రమ్య పసుపులేటి నటించారు. లక్ష్మణ్ కార్య దర్శకత్వంలో బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మించారు.

ఆ లోటును భర్తీ చేసేలా...



'నువ్వేకావాలి', 'మన్మథుడు', 'మల్లీశ్వరి' వంటి చిత్రాలతో పాపులర్ దర్శకుడిగా మారారు కె. విజయ్‌భాస్కర్. ఆయన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఈ లవ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్‌లో శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య ప్రధాన తారాగణంగా నటించారు. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా కె. విజయ్‌భాస్కర్ మీడియాతో ముచ్చటించారు. 'ఈ సినిమా ప్రేమకు సరికొత్త నిర్వచనం ఇస్తుంది. ఈ మధ్య కాలంలో ప్రేమ కథలు చాలా తక్కువగా వస్తున్నాయి. ఇది ఆ లోటును భర్తీ చేస్తుంది. ఇంటిల్లిపాదీ చూడదగిన చిత్రమిది. ఉషా అనే అమ్మాయి పెళ్లి చుట్టూ సినిమా కథాంశం సాగుతుంది. మా అబ్బాయి కమల్ కోసం ప్రత్యేకంగా కథ రాసుకుని ఈ సినిమా చేయట్లేదు. ఈ కథకు తను యాప్ట్ కాబట్టే కమల్‌ను హీరోగా ఎంచుకున్నాను. కమల్, కథానాయిక తాన్వీ నటన చాలా సహజంగా.. అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. ఈ సినిమాకు సంగీతం ప్రధానాకర్షణ. ఆర్.ఆర్.ధ్రువన్ అద్భుతమైన పాటలు అందించారు. సినిమా యూత్‌తో పాటు ఫ్యామిలీని కూడా ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

కాలరెత్తి తిరగరా...



దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'లక్కీ భాస్కర్'. మీనాక్షి చౌదరి కథానాయిక. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ 7న విడుదలవుతోంది. ఆదివారం దుల్కర్ సల్మాన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం 'లక్కీ భాస్కర్' టైటిల్ ట్రాక్‌ను విడుదల చేసింది. 'శభాష్ సోదరా...కాలరెత్తి తిరగరా...కరెన్సీ దేవి నిను వరించెరా' అంటూ సాగే ఈ గీతానికి రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించారు. జీవీ ప్రకాశ్ కుమార్ స్వరాలందించారు.

ఆకాశంలో ఒక తార

పవన్ సాదినేని దర్శకత్వంలో దుల్కర్ కథానాయకుడిగా నటించబోయే కొత్త చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాకు 'ఆకాశంలో ఒక తార' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గీతా ఆర్ట్స్, స్వప్న సినిమా, లైట్ బాక్స్ మీడియా సమర్పణలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో రైతు లుక్‌లో దుల్కర్ కనిపించారు. త్వరలో రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

రహ'దారుణాలు'

- ఐదేళ్లుగా నిర్వహణపై నిర్లక్ష్యం
- వర్షాలతో మరింత అధ్వానంగా తయారైన వైనం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జిల్లాలో పలు ప్రాంతాల్లోని రోడ్లు దారుణంగా ఉండడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడచిన ఐదేళ్లలో ఎటువంటి మరమ్మతులు, నిర్వహణ లేకపోవడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతలు ఏర్పడి, రాళ్లు తేలి వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం

బురదమయంగా..

నందిగాం: బెజ్జిపల్లిలో మెయిన్ వీధితో పాటు సచివాలయానికి వెళ్లే మార్గం బురదమయం కావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల పడిన వర్షాలతో రోడ్డంతా బురదగా తయారైంది. నడవడానికి ఇబ్బందిగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బురదతో నిండి బెజ్జిపల్లిలో మెయిన్‌వీధి రోడ్డు

ప్రమాదాలు జరుగుతున్నా..



బెండికొండ వద్ద ఇలా..

వజ్రపుకొత్తూరు: బెండికొండ సమీపంలోని ఆర్అండ్‌బీ గోతులమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోతుల్లో నీరు చేరి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. బెండికొండపై జల్‌జీవన్ మిషన్ వాటర్‌ట్యాంకు నిర్మాణం చేయడంతో భారీవాహనాలు రాకపోకలతో పాటు ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో దారుణంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

గోతులు పూడ్చేదెప్పుడో..?

సంతబొమ్మాళి: బోరుభద్ర-మేఘవరం ఆర్అండ్‌బీ రహదారిపై గోతులు ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. గడచిన ఐదేళ్లలో ఎటువంటి మరమ్మతులు చేపట్టక పోవడం, ఇటీవల కురిసిన వర్షాలకు నీరు చేరి ప్రమాదకరంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతులను పూడ్చాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.



గోతులతో నిండిన బోరుభద్ర-మేఘవరం రోడ్డు

ప్రయాణం.. భయం భయం



పాత జాతీయ రహదారి వద్ద ఇలా..

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మునిసిపాల్టీ పరిధిలో రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉండడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పాత జాతీయ రహదారి పోస్టాఫీసు-మేధరవీధి సమీపంలో కాలువ ఇలా ప్రమాదభరితంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. ఏమాత్రం ఏమరపాటుగా ప్రయాణించినా వాహనాలతో కాలువలో పడిపోవడం ఖాయం. భారీ ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదానికి ఆహ్వానం..

హిరమండలం: హిరమండలంలోని జగన్నాథస్వామి గుడి పక్కన ఉన్న మార్గంలో మురుగునీటి కాలువపై పలకలు తొలగించడంతో ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. రాత్రివేళల్లో కాలువ కనిపించకపోవడంతో ఎప్పుడు ఎవరు ఈ కాలువలో పడి ప్రమాదాలకు గురవుతారో తెలియని పరిస్థితి నెలకొంది. తక్షణం కాలువపై పలకలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువపై పలకలు లేక ప్రమాదకరంగా ఉన్న దృశ్యం

ప్రమాదకర రంధ్రం

ఎల్.ఎన్.పేట: ముంగెన్నపాడు గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డు మధ్య పెద్ద రంధ్రం ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. అలికాం- బత్తిలి ప్రధాన రోడ్డుకు అనుసరించి ఉన్న ముంగెన్నపాడు జంక్షన్ నుంచి సుమారు రెండు కిలో మీటర్ల మేర రోడ్డు రాళ్లుదేలి దారుణంగా ఉంది. అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులతో పాటు రంధ్రాన్ని పూడ్చే చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



ముంగెన్నపాడు సమీపంలో రోడ్డు మధ్య ఏర్పడిన రంధ్రం



విద్యార్థులకు నవోదయం

- 6వ తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు తుది గడువు సెప్టెంబరు 16

(హిరమండలం)

గ్రామీణ విద్యార్థులు మంచి ప్రమాణాలు కలిగిన విద్యను పొందేందుకు, అన్ని రంగాల్లో ప్రతిభావంతులుగా తయారయ్యేందుకు గాను కేంద్ర ప్రభుత్వం జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. కార్పొరేట్‌కు ధీటుగా గ్రామీణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఆరు నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈలో విద్యాబోధనతో పాటు విద్యార్థులకు ఉచిత వసతి, భోజన వసతి సౌకర్యాలు కల్పిస్తోంది. ఆరో తరగతిలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి వెన్నెలవలసలో జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఇక్కడ ఆరో తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడం, ఎంపిక విధానం వివరాలు ఇలా..

అర్హతలివే..

- నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశానికి ఒక్కసారి మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో 3,4 తరగతులు పూర్తి చేసి ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు.
- 2025-25 విద్యా సంవత్సరం కోసం 6వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 2013 మే ఒకటి నుంచి 2015 జూలై 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి.
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారు.
- అభ్యర్థులు గ్రామీణ ప్రాంత రిజర్వేషన్ పొందాలంటే 3, 4, 5 తరగతులు గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయం, ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లో పూర్తి విద్యా సంవత్సరం చదివి ఉత్తీర్ణులై ఉండాలి. పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఏ ఒక్క తరగతిలోనైనా ఒక్క రోజు చదివినా ఆ అభ్యర్థి పట్టణ ప్రాంత అభ్యర్థిగా పరిగణిస్తారు.

ఎంపిక విధానం ఇలా..

- 2025 జనవరి 18న ప్రవేశ పరీక్ష ఉంటుంది.
- మూడు విభాగాల్లో పరీక్ష నిర్వహిస్తారు. ప్రతి విభాగంలో లఘు జవాబుల (ఆబ్జెక్టివ్ టైప్) ప్రశ్నలుంటాయి.
- ఒక ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.
- సీబీఎస్ఈలో నిర్వహించే పరీక్షలో ప్రతిభ కనబరిచి ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల ఫలితాలను వెల్లడిస్తారు.
- మేధాశక్తికి సంబంధించి 40 ప్రశ్నలకు 50 మార్కులు ఉంటాయి. సమయం 60 నిమిషాలు ఉంటుంది. అలాగే గణితం 20 ప్రశ్నలకు 25 మార్కులు, సమయం 30 నిమిషాలు, భాషా పరిజ్ఞానానికి సంబంధించి 20 ప్రశ్నలకు 25 మార్కులు, సమయం 30 నిమిషాలు కేటాయిస్తారు.
- 100 మార్కులకు దాదాపు 90 మార్కులు సాధిస్తే సీటు దొరికే అవకాశం ఉంటుంది.

దరఖాస్తు చేయడం ఇలా..

ఆన్‌లైన్‌లో సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 01-05-2013 నుంచి 31-06-2015 మధ్య జన్మించిన విద్యార్థులు వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు ఫారం డౌన్‌లోడ్ చేసుకోవాలి. అభ్యర్థి ఇటీవల తీసుకున్న పాస్‌ఫొటో అతికించి సంతకం పెట్టి, తల్లిదండ్రులు, లేక సంరక్షకుని సంతకం చేయించాలి. అలాగే చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుని ద్వారా ధ్రువీకరించిన దరఖాస్తును తిరిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. దరఖాస్తులో తప్పులు లేకుండా చూసుకోవాలి. సెప్టెంబరు 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి.

నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం..

గ్రామీణ ప్రాంత విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారిలో నైపుణ్యం పెంపొందించడమే ఈ విద్యాలయాల లక్ష్యం. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించడంతో పాటు వారిలోని సామర్థ్యాన్ని వెలికితీసేలా పలు పరీక్షలు నిర్వహించి వాటిలో విద్యార్థులను భాగస్వామ్యం చేస్తారు. హిందీ, ఆంగ్లం, తెలుగు భాషల్లో నైపుణ్యాన్ని పెంపొందిస్తారు. అలాగే విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపుదల, స్పోర్ట్స్, గేమ్స్‌లో ప్రత్యేక తర్ఫీదుతో పాటు ఎన్‌సీసీలో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఆలయ స్థలంలో నిర్మాణాలు చేపడితే చర్యలు

- దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు

టెక్కలి, జూలై 28: పట్టణంలోని శ్యామసుందర స్వామికి చెందిన స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు అన్నారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'శ్యామసుందర స్వామి ఆలయ స్థలంలో అక్రమ నిర్మాణం' శీర్షికతో వచ్చిన కథనానికి దేవదాయశాఖ ఏసీ ప్రసాద్ పట్నాయక్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు, ఈవో మనస్విని, ఆలయ అర్చకులు పద్మనాభ పండా తదితరులు సదరు నిర్మాణాన్ని పరిశీలించి ఆక్రమణ దారుల నుంచి వివరాలు ఆరా తీశారు. ఆలయానికి సంబంధించి సర్వేనెం.540/2-3లో రెండు ఎకరాల 40 సెంట్లు స్థలం ఉందని, దీనిపై దేవదాయశాఖ నిరంతర నిఘా ఉందన్నారు. ఎవరైనా అక్రమ నిర్మాణాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సంబంధిత రికార్డులు వారీగా ఆ ప్రాంతంలో స్థలాన్ని పరిశీలించి ఆక్రమణలు జరగకుండా చూడాలని అర్చకులు పద్మనాభ పండాకు ఆదేశాలు జారీచేశారు.



అక్రమ నిర్మాణం వివరాలు ఆరాతీస్తున్న దేవదాయశాఖ అధికారులు

జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు పాటుపడాలి



మాట్లాడుతున్న ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు

కాశీబుగ్గ: జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు పాటుపడాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. కాశీబుగ్గ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం యూనియన్ జిల్లా 31వ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి మీడియా రంగం ప్రాణవాయువు లాంటిదన్నారు. జర్నలిస్టుల హక్కుల సాధనకు ప్రభుత్వాలు, పార్టీలు సహకరించాలని కోరారు. ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల హక్కులను కాపాడే చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం చేసిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పొప్పులను స్వీకరించే గుణం పార్టీలకు ఉండాలన్నారు. ఐజేయూ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ.. ఉద్యమ చరిత్ర ఉన్న ఉద్దానం గెడ్డపై మహాసభలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం ఏపీయూ డబ్ల్యూజే జిల్లా శాఖ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా చిగురువలస జగదీష్, చింతాడ అప్పలనాయుడు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా చంద్ర మోహన్‌దేవ్, సీహెచ్ నేతాజీ, సహాయ కార్యదర్శులుగా గేదెల చిన్నంనాయుడు, తిరుపతిరావు, కోశాధికారిగా బి.శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీఏపీఆర్వో చెన్నకేశ్వరరావు, మాజీ మంత్రి అప్పలరాజు, మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, జనసేన జిల్లా అధ్యక్షుడు పిశిని చంద్ర మోహన్, ఏపీయూడబ్ల్యూజే నేతలు ఈశ్వరరావు, పైడి బాలకృష్ణ, చింతాడ అప్పలనాయుడు, మహరాణా, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుట్టగొడుగు కూర తిని ముగ్గురికి అస్వస్థత

నరసన్నపేట: జమ్ము గ్రామానికి చెందిన శిమ్మ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు పుట్టగొడుగు కూర తిని అస్వస్థతకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం సాయంత్రం శ్రీనివాసరావు పొలంలో దొరికిన పుట్టగొడుగును తీసుకువచ్చి వంట చేశారు. కుటుంబ సభ్యులు ఆ కూరను తిన్న కొద్ది సమయానికి నోటి వెంబడి రక్తపు వాంతులు రావడంతో నరసన్నపేట సామాజిక ఆసుపత్రిలో చేరారు. భార్య అప్పమ్మ, కుమారుడితో కలిసి ఆసుపత్రిలో చేరిన శ్రీనివాసరావులకు వైద్యులు చికిత్సను అందజేశారు. ఆదివారం సాయంత్రం వరకు వైద్యుల పరిశీలనలో ఉంచారు. సకాలంలో ఆసుపత్రికి వెళ్లడంతో ప్రాణాలతో బయటపడ్డారని, వారు తిన్నది పుట్టగొడుగు పాము పుట్టగొడుగుగా స్థానికులు చెబుతున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థునికి ఆర్థిక సాయం

హిరమండలం: పిండ్రవాడ గ్రామానికి చెందిన కింజరాపు శంకర్ (34) రెండు కిడ్నీలు దెబ్బ తినడంతో ప్రస్తుతం డయాలసిస్ చేయించుకుంటున్న విషయం తెలుసుకుని పలువురు మిత్రులు, యువకులు ఆర్థిక సాయం అందించారు. ఎల్.ఎన్.పేట, హిరమండలం, భామిని మండలాలకు చెందిన ఉపాధ్యాయ మిత్రులు, గ్రామ యువకులు కలిసి రూ.70,200 సేకరించారు. ఈ మొత్తాన్ని మండల ప్రత్యేక ఆహ్వానితుడు తూలుగు తిరుపతిరావు బాధితుడి కుటుంబానికి అందించారు. పి.శ్రీధర్, కె.సత్యనారాయణ, కె.సింహాచలం పాల్గొన్నారు.

నక్సల్‌బరీ ఉద్యమంలో మజుందార్‌ది ప్రత్యేక పాత్ర

పలాసరూరల్: నక్సల్‌బరి పోరాటంలో ఉద్యమనేత చారూమజుందార్ ప్రత్యేక పాత్ర పోషించారని వక్తలు అన్నారు. నీలావతి గ్రామంలో ఆదివారం నక్సల్‌బరీ ఉద్యమకారుడు చారుమజుందార్ 52వ వర్ధంతిని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు మాట్లాడుతూ.. దేశంలో సమన్యాయానికి ఆయుధంతోనే పోరాటం చేయాలని ఈ ఉద్యమం రుజువు చేసిందన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కన్వీనర్ జుత్తు వీరాస్వామి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జిల్లా అధ్యక్షుడు సొర్ర రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో దళితులపై జరిగిన దాడులపై విచారణ చేయించాలి

టెక్కలి: ఐదేళ్ల వైసీపీ పాలనలో దళితులపై జరిగిన నరమేధంపై, భూముల కబ్జా, దాడులపై సిటింగ్ జడ్జితో విచారణ చేయించాలని సమతా సైనిక్‌దళ్ జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, ప్రధాన కార్యదర్శి ఎల్.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో రద్దుచేసిన పథకాలను పునరుద్ధరించాలని, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో మెడికల్ సీట్లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడం వల్ల అనేకమంది నష్టపోయారన్నారు.

జిల్లా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం ఎన్నిక

టెక్కలి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జిల్లా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుక్క శరత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా పి.హరికృష్ణ, జనరల్ సెక్రటరీగా దివాకర్, ఉపాధ్యక్షుడిగా కె.ప్రశాంత్, ట్రెజరర్‌గా టి. సంతోష్‌రెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీగా గౌతమి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సాహుకారి నవీన్, జాయింట్ సెక్రటరీగా ఆశాలత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహాలక్ష్మిని ఎన్నుకున్నారు. ఉద్యాన సహాయకులకు ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

నియోజకవర్గంలో సాగు, తాగునీటికి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

నరసన్నపేట,జూలై 28: నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తాగునీరు.. ప్రతీ ఎకరాలకు సాగునీరందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం సత్యవరం గ్రామంలో ఇంటింటికీ తాగునీరందించే కొళాయిలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాగునీటి కోసం సత్యవరం గ్రామంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అధికారంలోకి వచ్చిన వెంటనే దేవాది వద్ద బోరు పంపులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే వంశధార కాలువల పనులు చేయించి ప్రతీ ఎకరాకు సాగునీరు కల్పించడం జరిగిందని, రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారన్నారు.అంతకుముందు పాదాల అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వంట గదిని ప్రారంభించారు. కార్యక్రమంలో మావుడూరి జగదీష్‌బాబు, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, నేతలు కింజరాపు రామారావు, బైరి భాస్కరరావు, ధర్మాన తేజశ్వరరావు, శిమ్మ జగన్నాథం, నేతింటి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నీటి సరఫరాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

హిరమండలం: మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామస్థాయిలోని సమస్యలు పరిష్కారం కావాలంటే క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు సమావేశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో స్వరూపరాణికి సూచించారు. వివిధ సమస్యలను సర్పంచ్‌లు సమావేశం దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన మామిడి గోవిందరావును మండల పరిషత్ అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించి అభినందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

సమస్యలు పరిష్కరించాలి

హిరమండలంలోని చిన్నకోరాడవీధిలో గత కొన్నేళ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పలువురు యువకులు ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందించారు. గ్రామదేవత ఆలయానికి విద్యుత్ సౌకర్యం, శ్మశాన వాటికకు సీసీ రహదారి, కాలువల నిర్మాణానికి కృషి చేయాలని నందిగాం సాయికృష్ణ పట్నాయక్, వార్డు సభ్యుడు వి.సింహాచలం తదితరులు కోరారు.

ఘనంగా ఆవేటి వారాలు



ముర్రాటలతో ఊరేగింపుగా వెళుతున్న మహిళలు

హిరమండలం: హిరమండలంలో ఆదివారం ఆవేటి వారాలు ఘనంగా నిర్వహించారు. అందవరపు వీధి, దేవరశెట్టి వీధుల్లో నివాసం ఉంటున్న వారు కుటుంబాలతో కలిసి పాత హిరమండలంలో దుర్గాదేవి, అగ్రహారం తల్లి అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



ఉజ్జుడి ఊరేగింపు చేపడుతున్న దృశ్యం

ఘనంగా ఉజ్జుడి ఉత్సవం

పలాసరూరల్: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఉజ్జుడి ఉత్సవం నిర్వహించారు. మహిళలు అమ్మవారిని పూజించేందుకు ప్రత్యేక ప్రసాదాలను అందజేశారు. అనంతరం రైతులు సామూహికంగా ఊరేగింపు నిర్వహించి వివిధ చోట్ల అమ్మవార్లకు పంటలు పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు, రైతులు పాల్గొన్నారు.

- **హరిపురం:** మఖరజోల గ్రామంలో ఆదివారం ఉజ్జిడమ్మ తల్లి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా దమ్ములు చేపట్టే ముందు ఈ ప్రత్యేక పూజలు నిర్వహించి ఘటం అందజేశారు. అనంతరం ముర్రాటలతో చల్లదనం చేసి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలతోపాటు యువత, రైతులంతా కలసి ఉజ్జిడిమ్మతల్లి ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులు బమ్మిడి కర్రయ్య భూపతిరావు, కె.మాధవరావు తదితరులు పాల్గొన్నారు.



ఉజ్జిడమ్మకు ఊరేగిస్తున్న భక్తులు

ఘనంగా అనఘాష్టమి పూజలు

నందిగాం: నందిగాం షిర్డీసాయి ధ్యానమందిరంలో ఆదివారం అనఘాష్టమి పూజలు ఘనంగా నిర్వహించారు. గ్రామపురోహితులు ఎం.రమేష్‌శర్మ పర్యవేక్షణలో విశేష అర్చనలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అనఘాష్టమి కథనం చదివి వినిపించారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

వజ్రపుకొత్తూరు: మండలంలో విద్యుత్ సమస్యలు అనేకం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించడం లేదని, పూర్తిస్థాయి ఏఈ లేకపోవడంతో సమస్య ఉత్పన్నమవుతోందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు అడిగిన విద్యుత్ సమస్యలపై ఎంపీపీ స్పందిస్తూ.. అన్ని గ్రామాల్లో విద్యుత్ సమస్యలున్నాయని సోమవారం ప్రత్యేక సమావేశంలో మాట్లాడదామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, డీటీ వి.గిరిరాజు, ఐసీడీఎస్ పీవో పి.లావణ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

పాతపట్నం: రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు ఎన్టీఆర్ గ్రీన్‌ఫీల్డ్ మినీ స్టేడియంలో ఆదివారం సాఫ్ట్‌టెన్నిస్ జూనియర్ జట్ల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీల్లో బాలుర నుంచి 35 మంది, బాలికల నుంచి 25 క్రీడాకారులు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్షుడు జి.అప్పన్న తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పీడీ యెన్ని శేఖర్‌బాబు, వ్యాయామోపాధ్యాయులు జె.కృష్ణ, జె.శ్రీను, బి.లోకేశ్, సుజాత, దుర్గమ్మ, డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయండి

వజ్రపుకొత్తూరు: జీవో 117 రద్దు చేసి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని ఏపీటీఎఫ్ (1938) ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆదివారం వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో జిల్లా కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు టెంక చలపతిరావు మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జల్లేడ రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, జిల్లా, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చాత్తాద శ్రీవైష్ణవ సంఘంలో ఇద్దరికి చోటు

పోలాకి: జిల్లా చాత్తాద శ్రీవైష్ణవ సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు, తులసిపాటి కృష్ణ, కోశాధికారి కోనేటి మోహనరావు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఈ ఎన్నికలు జరిగాయన్నారు. జిల్లా సంఘంలో మాకు చోటు లభించడం ఆనందంగా ఉందన్నారు. జిల్లా సంఘం టీడీపీ అనుబంధంగా పనిచేస్తుందని, మండల, గ్రామస్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఎరువులు విక్రయానికి సిద్ధం

పోలాకి: పోలాకి సహకార సొసైటీ ద్వారా అన్ని రకాల ఎరువులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని సీఈవో రాంబాబు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. సొసైటీ ద్వారా 20 టన్నుల యూరియా ఎరువులు సరఫరా చేశామన్నారు. రైతులు తమ పాస్ పుస్తకాల నకళ్లను చూపించి డబ్బులు చెల్లించి యూరియాను పొందవచ్చన్నారు.

వెయ్యిలీటర్ల జీవామృతం తయారీ

నందిగాం: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఆదివారం రౌతుపురంలో వెయ్యి లీటర్ల జీవామృతాన్ని తయారుచేశారు. గ్రామానికి చెందిన విశ్రాంత పోలీస్ ఉన్నతాధికారి బొజ్జ వేణు గోపాలకృష్ణ నేతృత్వంలో రౌతుపురం యూనిట్-ఎల్2 లోకేష్ ఆధ్వర్యంలో దీనిని తయారుచేశారు.

పర్యవేక్షణ లేక.. పరిష్కారానికి నోచుకోక

● అధ్వానంగా అంతర్గత రోడ్లు ● కూటమి ప్రభుత్వంపై పట్టణ వాసులు ఆశలు
● ఇదీ ఆమదాలవలస మునిసిపాలిటీలో పరిస్థితి

ఆమదాలవలస: ఆమదాలవలస మునిసిపాలిటీలో సమస్యలు పాగా వేశాయి. ప్రధానంగా పాలక మండలి లేకపోవడంతో పాలనపై పర్యవేక్షణ లేకుండా పోయింది. దీంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదు. పలు వార్డుల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. దీనికితోడు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. కొన్నిచోట్ల తాగునీటి పైపులైన్లు మురుగునీటి కాలువల్లో లీకవుతుండడంతో పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. పార్కుల నిర్వహణ గాడి తప్పడంలో ప్రజలు ఆహ్లాదం కరువవుతోంది.ఐదేళ్లుగా మునిసిపల్ అధికారులు 23 వార్డుల్లో నెలకొన్న సమస్యలపై దృష్టిసారించలేదన్న విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సమస్యలు పరిష్కరిస్తుందన్న ఆశలు రేకెత్తుతున్నాయి.

తాగునీటి ఎద్దడి..

మునిసిపాలిటీ పరిధిలోని తిమ్మాపురం, జగ్గుశాస్త్రులపేట, పార్వతీశ్వునిపేట, చింతాడ, సప్తపురాలు తాగునీటి కొళాయిలు లేకపోవడంతో కేవలం రెండు నీటిట్యాంకర్లతో మూడు రోజులకు ఒకసారి తాగునీరందిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. మిగతా ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పైపులైన్లు దెబ్బతింటున్నాయి. ఈ నేపథ్యంలో నిర్ణీత సమయాల్లో తాగునీరందక మంచి నీటి కొళాయిలు ఎప్పుడు వస్తాయోరావో తెలియని అవస్థలకు గురవుతున్నారు.

అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ

మునిసిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. పారిశుధ్య నిర్వహణలోపం వల్ల దుర్వాసన వెలువడు తుండడంతోపాటు దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో చీకటిపడిన తర్వాత పలుప్రాంతాల్లో ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. కొన్ని ప్రాంతాల్లో మురుగు నీటిని కాలువల్లోనే తాగునీటి పైపులు ఏర్పాటుచేశారు. అవి తరచూ లీకేజీ అవుతుండడంతో తాగునీటిలో మురుగునీరు కలిసిపో తుండడంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు.

సీసీ రహదారులు లేక ఇబ్బందులు..

మునిసిపాలిటీ పరిధిలోని ఎనిమిదో వార్డులో ఉన్న బీఆర్‌నగర్ ఏర్పడి 15 సంవత్సరాలు కావస్తోంది. ఈ ప్రాంతంలో ఎటువంటి సీసీ రహదారులు నిర్మాణానికి పాలకులు, మునిసిపల్ అధికారులు చర్యలు తీసుకోలేదు.దీంతో బీఆర్‌నగర్ వాసులు అవస్థలుపడుతున్నారు. ఇక్కడ గ్రావెల్, మట్టి రోడ్లు దర్శనమిస్తున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో నిత్యం మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. డ్రైనేజీ లేకపోవడంతో ఎవరి ఇంటి ముందు వారు మురుగునీటి గుంతల ఏర్పాటు చేసుకునేవారు. ఇటీవల వార్డు సచివాలయ ఉద్యోగులు 15 ఏళ్లుగా ఎటువంటి మౌలిక వసతులు కల్పించని మునిసిపల్ అధికారులను వదిలేసి మురుగునీటి గుంతలను ఏర్పాటుచేసినా తమకు నోటీసులివ్వడం ఎంతవరకు సమంజసమని బీఆర్‌నగర్‌కు చెందిన పలు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.


చింతాడలో తాగునీటికి కుళాయి వద్ద బిందెలతో బారులుతీరిన మహిళలు

గాడితప్పిన పార్కుల నిర్వహణ..

మునిసిపాలిటీ పరిధిలో ఉన్న వివిధ పేర్లతో ఉన్న ఎనిమిది పార్కుల నిర్వహణ గాడితప్పింది. తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అప్పటి మునిసిపల్ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతావిద్యాసాగర్ పట్టణ ప్రజలకోసం పార్కుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఐదేళ్లగా మునిసిపల్ అధికారులు కనీస నిర్వహణ చేపట్టకపోవడంతో ప్రస్తుతం పార్కులు ముళ్లపొదలతో నిండి అధ్వానస్థితికి చేరుకున్నాయి. పట్టణంలోని ప్రధాన రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన గ్రీన్‌ల్యాండ్ గ్రిల్స్ కూడా తుప్పుపట్టి పూర్తిగా పాడైపోయాయి. ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వివిధ జాతీయ నాయకుల విగ్రహాలు శిథిలావస్థకు చేరుకున్నా మరమ్మతులకు నోచుకోవడం లేదు.


19వ వార్డు పరిధిలోగల పాత ఆమదాలవలసలో నిల్వఉన్న మురుగు నీరు

సాగు నీటికోసం తోపులాటలో ఒకరి మృతి

గార: మండలంలోని అంపోలు పంచాయతీ పరిధిలోగల కోళ్లపేటలో ఆదివారం ఉదయం పొలం వద్ద సాగునీటి కోసం జరిగిన తోపులాటలో అదే గ్రామానికి చెందిన తట్ట తవుడు (70) మృతిచెందాడు. గార ఎస్ఐ కృష్ణప్రసాద్ కథనం మేరకు..సాగునీటి విషయంలో వంజల సునీత, తట్ట తవుడులకు చెందిన పొలాలు వద్ద ఆదివారం ఉదయం మాట మాట పెరిగింది. ఆ సమయంలో తోపులాటలో భాగంగా వంజల సునీత అక్కడే ఉన్న తట్ట తవుడును గుండెపై చెయ్యి వేసి తోయడంతోఅక్కడ పడిపోయి స్పృహకోల్పోయాడు. దీంతో రిమ్స్‌కు తీసుకు వెళ్లగా అప్పటికే తవుడు చనిపోయినట్లు వైద్యులు తెలియజేశారు. దీంతో తవుడు కుమారుడు సింహాచలం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసును సీఐ ఎల్.ఎస్.నాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

మూడు లారీలు సీజ్

ఆమదాలవలస: మండలంలోని సేపేపేట,నిమ్మతొర్లోడ గ్రామాల మధ్య వంశధార నదిలో శనివారం అర్థరాత్రి ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. హెచ్‌సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో సిబ్బంది, తనిఖీలు నిర్వహించగా అదే ప్రాంతానికి చెందిన ట్రాక్టర్ ఇసుకలోడుతో దొరకగా, మరో మూడు లారీలతోపాటు యంత్రాన్ని పట్టుకొని ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.ఈమేరకు కేసు నమోదుచేసి అక్రమ ఇసుకతవ్వకాలు జరుపుతున్న యంత్రంతో పాటు రవాణాచేసే మూడు లారీలను కూడా సీజ్ చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

13 నీటి ఇంజిన్లు స్వాధీనం

జలుమూరు: చోరీకి గురైన 13 నీటి ఇంజిన్లు స్వాధీనం చేసుకుని చోరీకి పాల్పడిన సరుబుజ్జిలి మండలంలోని వీరమల్లిపేటకి చెందిన ఏలేటి జనార్దనరావు, ఆదిరెడ్డి రంగారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. మండలంలోని కరకవలసకు చెందిన పేడాడ రామారావు తన ఇంజిను చోరీకిగురైనట్లు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. పోలీసులు కథనం మేరకు ..సరుబుజ్జిలి మండలంలోని వీరమల్లిపేటకు చెందిన ఏలేటి జనార్దనరావు, ఆదిరెడ్డి రంగారావు మేనళ్లుడు, మేనమామలు. వీరిద్దరు కలిసి వంశధార కాలువలు, చెరువుల వద్ద సాగునీటి కోసం రైతులు పెట్టిన నీటి ఇంజిన్లు పగలు చూసి రాత్రివేళ ఆటో వేసుకొని వెళ్లి చోరీకి పాల్పడేవారు. ఆ నీటి ఇంజిన్లు ఇంటికి తరలించి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకొనేవారు. ఈనేపథ్యంలో వీరి వద్ద నుంచి 13 నీటి ఇంజన్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం నాలుగు రైతులకు అప్పగించగా, మిగతావి ఆయా రైతులకు అప్పగించనున్నారు.

'లేత చేతులకు ఊతం' కవితకు ప్రశంస

ఆమదాలవలస: పట్టణానికి చెందిన కవి కుప్పిలి వెంకట రాజారావుకు పురస్కారం లభించింది. ఈ మేరకు 'లేత చేతులకు ఊతం' అన్న కవితకు ఆదివారం కాకినాడకు చెందిన సాహిత్య సాంస్కృతిక సంస్థ రాజారావుకు సత్కరించి పురస్కారాన్ని అందించింది. రాజారావుకు పురస్కారం రావడం పట్ల పట్టణంలోని సాహితీ అభిమానులు, కళాకారులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి సాగు


లైనింగ్‌పై వరి నాట్లు వేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: చేపేనపేట, నిమ్మతొర్లోడల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పదెకరాల విస్తీర్ణంలో ఆదివారం సీడ్ టు సీడ్ కాంపాక్ట్ బ్లాక్‌లో వరి నాట్లు వేయించారు. ఈ సందర్భంగా ఎల్‌టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ డీపీఎం రేవతి ఆదేశాల మేరకు విత్తనం వేసినప్పటి నుంచి మళ్లీ పంట చివరి దశ వరకు కాంపాక్ట్ బ్లాక్‌ల్లో ఉన్న రైతుల పంట పొలాల్లో పూర్తిగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరిస్తూ క్షేత్రస్థాయిలోపనిచేస్తున్నామని తెలిపారు. ఈ విధానంలో లైన్‌షోయింగ్ పద్ధతిలో వరి వేసుకోవడంతోపాటు గట్లపై కూరగాయలను రైతులు సాగుచేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది నక్క చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఖరారు


బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పురుషులు, మహిళల పోటీలకు జిల్లా జట్లు ఖరారు చేశారు. శ్రీకాకుళంలోని శాంతినగర్‌కాలనీ దరిలో ఉన్న నాగావళి నదిలో ఆదివారం బీచ్ కబడ్డీ పోటీలకు జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించారు.ఈమేరకు తుదిజట్టును కూడా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి సాధు శ్రీనివాసరావు ప్రకటించారు. వీరంతా నెల్లూరు జిల్లాలో ఆగస్టు రెండు నుంచి నాలుగో తేదీ వరకు జరగనున్న రా ష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. పర్యవేక్షకులుగా సీనియర్ కబడ్డీ క్రీడాకారులు సాధు కోటేశ్వరరావు, డితవిటమ్మ, జి.యమునారాణి పాల్గొని జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. కార్య క్రమంలో శిక్షకులు ఎస్.సింహాచలం, కె.జాన్సీ పాల్గొన్నారు.

● **పురుషుల జట్టు:** పి.యుగంధర్ (సింగుపురం), పి.మణికంఠ, పి.గణేష్ (పాలకొండ), పి.పవన్(కవిటి), పి.తరుణ్(శ్రీకాకుళం), ఎస్.రామ్‌మోహన్‌రావు (ఆకులపేట). ●**మహిళజట్టు:** హర్షిత(పల్లిసారథి), ఎస్.హసీనా (తోటపాలెం), కె. శ్రావణి (రణస్థలం), టి.లీస, టి.యమున, బి.సింధుజ (పల్లిసారథి).

సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలి

గుజరాతీపేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి మరింత కృషిచేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.రామారావు కోరారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో బహుజన టీచర్స్ అసోసియేషన్ 24వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ రమేష్, బి.తాతారావు, ఎ.అనంద్, పి.ప్రతాప్‌కుమార్, టి.అనీల్‌కుమార్, జి.ఉమామహేశ్వరరావు, రత్నం పాల్గొన్నారు.


సచివాలయం భవనం శ్లాబ్ పెచ్చులు ఊడుతున్న దృశ్యం


అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయం భవనం పనులు

పెచ్చులూడి..శిథిలావస్థకు చేరి

●తుఫాన్ షెల్టర్‌లో తోణంగి సచివాలయం ● నిలిచిన భవనం పనులు

గార: మండలంలోని తోణంగి గ్రామసచివాలయం భవనం శ్లాబ్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. ప్రస్తుతం స్థానికంగా ఉన్న తుఫాన్ షెల్టర్‌లో సచివాలయం నిర్వహిస్తున్నారు. ఆ భవనం కూడా దశాబ్దాల కిందట నిర్మించినది కావడంతో శ్లాబ్ పెచ్చులు ఇటీవల ఊడిపోయి కింద పడుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో సిబ్బంది బిక్కు బిక్కుమని విధులు నిర్వహించాల్సి వస్తోంది. వైసీపీ హయాంలో గ్రామ సచివాలయం భవనం మంజూరుచేసినా పనులు అర్థాంతరంగా నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారులు చర్యలు తీసుకొని అసంపూర్తిగా ఉన్న సచివాలయం భవనం పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

ఎరువులు సరఫరా చేయండి

● ఆమదాలవలస ఎమ్మెల్యే రవికుమార్


రవికుమార్‌కు సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సరుబుజ్జిలి: ప్రతి రైతుకు ఖరీఫ్‌లో ఎరువులు సకాలంలో సరఫరా చేయాలని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యవసాయాధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని చిన్నపాలెంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన రవికుమార్‌ను టీడీపీ నాయకులు గజ్జన చంటి, నాగం రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్థులు సన్మానించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు ఇంకా ఎరువులు సరఫరా చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏవో బి.పద్మనాభంతో రవికుమార్ ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివ్వాల సూర్యనారాయణ, ఎ.రాంబాబు, ఎన్.గోవిందరావు, పి.సురేష్, కె.సిద్ధార్థ, ఎల్.పూర్ణారావు, టీవీ రమణ, టి.రాజారావు పాల్గొన్నారు.

స్టేషనరీ లేదు.. సదుపాయాలు లేవు

● ఇదీ ఇచ్ఛాపురంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పరిస్థితి


ఓ సచివాలయంలో అరకొర సౌకర్యాలతో సేవలందిస్తున్న ఉద్యోగులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మండలంలోని వార్డు, గ్రామ సచివాలయాల్లో స్టేషనరీతోపాటు సదుపాయాలు లేకపోవడంతో సిబ్బంది ఇబ్బందిపడుతున్నారు.మునిసిపాలిటీ పరిధిలో పది వార్డు, మండలంలో 16 గ్రామ సచివాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో 200.మంది వరకు సిబ్బంది పనిచేస్తున్నారు. ఏడాదిగా కనీసం స్టేషనరీ లేకపోవడంతో నిర్వహణ భారంగా మారుతోందని పలువురు వాపోతున్నారు.దీనికితోడు తరచూ కంప్యూటర్లు, ప్రింటర్లు సాంకేతిక సమస్యలతో పట్టణ ప్రాంతాలకు వెళ్లాల్సివస్తోందని చెబుతున్నారు. పలు సచివాలయాలకు ఇంటర్‌నెట్ సదుపాయం కూడా సరిగ్గాలేదు. కంప్యూటర్లు, ప్రింటర్లుమరమ్మతులను సొంతఖర్చులతో చేయించుకుంటున్నామని పలువురు సిబ్బంది చెబుతున్నారు.కూటమి ప్రభుత్వంలో దృష్టిసారించి స్టేషనరీ అందుబాటులోకి తీసుకురావాలని పలువురుకోరుతున్నారు.కాగావార్డు సచివాలయాలకు నిధుల కొరత నెలకొందని మునిసిపల్ కమిషనర్ ఎన్.రమేష్ తెలిపారు.

ఆదిత్యుని ఆదాయం రూ.3.03 లక్షలు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం రూ. 3,03,223లు ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.69,300లు, విరాళాల రూపంలో రూ.87.653లు, ప్రసాదాల ద్వారా రూ.1,46,270ల ఆదాయం లభించిందని ఆదిత్య ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఇవ్వాలి

రణస్థలం: నామినేటెడ్ పదవుల్లో రజకులకు ప్రాధాన్యం ఇవ్వాలని టీడీపీ విజయనగరం పార్లమెంట్ రజక సాధికారిక కన్వీనర్ గురజాపు రాము ఐటీ మంత్రి నారా లోకేష్‌బాబును కోరారు. శనివారం ఆయన్ను విజయవాడలో కలిశారు. రజకలు ఆది నుంచి టీడీపీతోనే ఉన్నారని వివరించారు. 50 ఏళ్లకే పింఛన్ సౌకర్యం కల్పించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. రజకుల సమస్యలు మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు.


లోకేష్‌ను కలిసిన రాము

కృష్ణమూర్తి కుటుంబానికి పరామర్శ

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు షావుకారి కృష్ణమూర్తి మృతిచెందడంతో కుటుంబ సభ్యులను ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదివారం పరామర్శించారు. ఆయన వెంట టీడీపీ పట్టణాధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, రెయ్యి జానకిరావు, ఆశి లీలారాణి తదితరులు ఉన్నారు.


కృష్ణమూర్తి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న అశోక్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1976 ఎంహెచ్‌స్కూల్ బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని ఇందిరావిజ్ఞాన్ భవన్‌లో ఆదివారం 1976 ఎంహెచ్‌స్కూల్‌లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీక సమ్మేళనం నిర్వహించారు.ఈసందర్భంగా ఆనాటి పాతజ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఓ మిత్రుడు వైద్య ఖర్చుల కోసం రూ.10 వేలు అందచేశారు. అనంతరం షోడవరం ఈశ్వరరావు ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు.

107 మంది రక్తదానం

అరసవల్లి: శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం స్కూల్ ఆవరణలో ఆదివారం న్యూ ఆదిత్య వాకింగ్, జుంబా డాన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 107 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు మాట్లాడుతూ రక్తదానం చేసి మరొకరి జీవితానికి వెలుగును పంచుదామని, శ్రీకాకుళాన్ని రక్తం కొరత లేని జిల్లాగా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి మాట్లాడుతూ రక్తదానం చేయడంపై అపోహలు వీడాలన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు, బి.దేవీప్రసాద్, కె.సాయికృష్ణ, బి.గారయ్య, రామకృష్ణ, జి.ఇందిరాప్రసాద్, పీజీ గుప్తా, కొంక్యాన మురళి పాల్గొన్నారు.


రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

స్నేహితుని కుటుంబానికి సాయం

సోంపేట: పూర్వ విద్యార్థులు తోటి స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకున్నారు. మామిడిపల్లికి చెందిన తోట రాజారావు ఉపాధి నిమిత్తం బెహ్రాయిన్ వెళ్లగా అక్కడ మృతిచెందాడు. దీంతో ఆయన కుటుంబ సభ్యులకు 1996- 2001 బ్యాచ్ తోటి విద్యార్థులు రూ. 2,05,250లను పోస్టాఫీసులో జమచేశారు. ఈ పత్రాన్ని కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు.

●**ఇచ్ఛాపురం:** మండలంలోని తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన అనురాధ బిసాయి కిడ్నీవ్యాధితో బాధపడుతోంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు శ్రీకాళీమాత సేవాసమితి సభ్యులు ఆదివారం రూ.పదివేలు అందజేశారు. కార్యక్రమంలో భీమరాజు, మన్మథరావు, నరేంద్ర, రమేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా తులసమ్మతల్లి సంబరాలు

ఇచ్ఛాపురం: లొద్దపుట్టి గ్రామదేవత ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని పలు వీధులకు చెందిన మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించారు.

ఆర్టీఐ చట్టంపై అవగాహన

గుజరాతీపేట: శ్రీకాకుళంలోని కొన్నావీధి ఎంపీఆర్ న్యాయ కళాశాలలో ఆదివారం ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)పై కార్యశాలను ఏజీపీ సీపాన గోవిందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా చట్టంపై అవగాహన కల్పించారు.ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్రీనివాసరావు పలు సెక్షన్లపై వివరించారు. కార్య క్రమంలో ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి ఉంగటి వెంకటరమణ, ఉపాధ్యక్షులు కె.రాజేష్, పి.వెంకటరావు, సిహెచ్.లక్ష్మణరావు, కె.రమేష్ పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోక.. వినియోగంలో లేక

● శిథిలావస్థకు చేరుకుంటున్న భవనాలు ● ఇదీ జీసీసీ గోదాముల పరిస్థితి


శిథిలావస్థకు చేరిన హిమగిరి గోదాము

పలాస రూరల్/మందస

మందస మండలంలోని కిల్లోయి, పలాస మండలంలోని హిమగిరిలో గిరిజన సహకార సంస్థ(జీసీసీ) గోదా ములు మరమ్మతులు లేకపోవడంతో వినియోగించడానికి వీల్లేకుండా తయారయ్యాయి. ఆ శాఖ నిర్లక్ష్యం వల్ల భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గిరిజనుల అభివృద్ధికి ఏర్పాటు చేసిన గిరిజన సహకార సంస్థపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం పుణ్యమాని సంస్థ నీరుగారుతోంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన గోదాములు కనీస మరమ్మతులకు నోచుకోకపోవంతో గోదాములు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.ఈ గోదాముల నుంచి నిత్యావసర సరుకులను గిరిజనులకు పంపిణీ చేస్తున్నారు. తితలీ తుఫాన్ అనంతరం కిల్లోయి కాలనీలో నిర్మించిన గిరిజన సహకార సంస్థ గోదాముకు సంబంధించి పైకప్పు ఎగిరిపోగా, అదనపు పాఠశాల గదిలో సరుకులను ఉంచి పంపిణీ చేసేవారు. ఈ నేప థ్యంలో చుట్టూ పిచ్చిమొక్కలు పెరగడం, పైకప్పు ఎగిరిపోయి ఐదేళ్లైనా పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంది. హిమగిరిలో గిరిజన సహకార సంస్థ గోదాము చుట్టూ కూడా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. గోడ, స్లాబ్ పెచ్చులూడి శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి నుంచే నిత్యావసర సరుకులు పంపిణీ జరుగుతున్నా అధికారులు కనీస మరమ్మతులకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని పలువురు గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోదాములకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.


కిల్లోయి కాలనీ గోదాము చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కలు